# సాక్షి
## విజయనగరం

ఆదివారం । 26 । మార్చి । 2023




### ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధంకండి

విద్యార్థులు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ సూర్యకుమారి పిలుపునిచ్చారు.

- 8లో



### పిడుగు పాటుకు నలుగురికి గాయాలు

గుర్ల మండలంలోని కొండగండ్రేడులో శనివారం పిడుగు పాటుకు నలుగురు మహిళలు కోమాలోకి వెళ్లిపోయారు.


- 8లో



### ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణకుమారి వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

- 8లో




## న్యూస్‌రీల్

### భూసార పరీక్షలకు సన్నద్ధం



భూసార పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు

విజయనగరం ఫోర్ట్: కరోనా వ్యాప్తితో రెండేళ్లుగా నిలిచిపోయిన భూసార పరీక్షల నిర్వహణకు పరికరాలను సిద్ధంచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు సిబ్బందిని ఆదేశించారు. విజయనగరం భూసార పరీక్షకేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. భూసార పరీక్షలు నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం సహాయసంచాలకుడు బి.భానులత పాల్గొన్నారు.

### నలుగురు డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ఫిజిక్స్ పేపర్-1, ఎకనామిక్స్ పేపర్-1 పరీక్షకు విజయనగరం ఉమ్మడి జిల్లాలో శనివారం 26,058 మంది విద్యార్థులు హాజరయ్యారు. 1936 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ ఐఓ నాలుగు పరీక్ష కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42, ఇతర అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్టు ఆర్ ఐఓ ఎం. సత్యనారాయణ తెలిపారు.

### 27న మంత్రి బొత్స రాక

- వంగర, గుర్ల మండలాల్లో పర్యటన

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ నెల 27న జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు వంగర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైఎస్సార్ ఆసరా ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు గుర్ల మంగలం గూడెంలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గుర్ల మండల స్థాయిలో ఆసరా ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

విజయనగరం పూల్‌బాగ్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కృతజ్ఞతలు తెలిపారు. కంటోన్మెంట్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎంను అభినందించారు. కార్యక్రమంలో కె. వరలక్ష్మి, ఎస్.వరప్రసాద్, మని తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక ఆసరా



- ఇచ్చిన మాట నిలబెట్టుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.251 కోట్ల రుణమాఫీ నిధులు విడుదల
- జిల్లాలో 3,92,613 మంది మహిళలకు లబ్ధి
- మూడు విడతల్లో రూ.754.13 కోట్ల సహాయం అందజేత
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ సూర్యకుమారి, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి, తదితరులు

విజయనగరం అర్బన్:

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని, మూడున్నరేళ్లగా పథక ప్రయోజనాలన్నీ మహిళలకే వర్తింపజేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏదైనా మాట ఇస్తే దానిని నిలబెట్టుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టంచేశారు. మహిళాపొదుపు సంఘాలసభ్యులకు మూడో విడత వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమానికి ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి శనివారం శ్రీకారంచుట్టారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో జెడ్పీచైర్మన్‌తో పాటు కలెక్టర్ ఎ.సూర్యకుమారి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు తిలకించారు. అనంతరం జిల్లాలోని 36,463 స్వయం సహాయక సంఘాల్లోని 3,92,613 మంది మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా సహాయంగా రూ.251.30 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.213.31 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు రూ.37.98 కోట్ల ఆర్థిక లబ్ధి కలగనుందని జెడ్పీ చైర్మన్ వెల్లడించారు. ఉమ్మడి విజయగనం జిల్లాలో 4.85 లక్షల మంది మహిళలకు రూ.275 కోట్ల మూడో విడత ఆసరా సహాయం అందజేసినట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ నాటికి డ్వాక్రా మహిళలు చెల్లించాల్సి ఉన్న మొత్తం రుణాలను 4 విడతల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం సహాయం అందిస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు ఇస్తున్న ముఖ్యమంత్రికి మహిళల అండదండలు, అభిమానం ఉండాలన్నారు. మహిళలు రాజకీయంగా కూడా రాణించాలని, వారు సామాజికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వారికి 50 శాతం పదవులు కేటాయించి మహిళా సాధికారతను చేతల్లో నిరూపించారని చెప్పారు. రానున్నరోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్గాలను సంతృప్తిపరిచే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజల అండదండలతో ప్రభుత్వం ఏర్పడిందని, అందరి సంక్షేమం కోసం పనిచేస్తోందని వివరించారు.



విద్యార్థినికి కళ్లద్దాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్



విద్యార్థినికి కళ్లద్దాలు పెడుతున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

#### కళ్లద్దాల పంపిణీ

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురు పాఠశాల విద్యార్థినులకు కళ్లద్దాలను జెడ్పీ చైర్మన్‌తో పాటు కలెక్టర్, మేయర్, డిప్యూటీమేయర్ అందజేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 3,821 మంది బాలికలకు కళ్లద్దాలను అందజేసినట్టు కంటి వెలుగు ప్రత్యేక అధికారి వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్‌చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఇన్విజిలేటర్ల తొలగింపు

- మద్యం మత్తులో విధులకు హాజరు
- తీవ్రంగా స్పందించిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

కురుపాం: ఇంటర్మీడియట్ పరీక్షల ఇన్విజిలేషన్‌కు మద్యం సేవించి హాజరైన ఇద్దరు అధ్యాపకులను విధుల నుంచి తొలగిస్తూ ఆర్జేడీ (రాజమండ్రి) ఈ నెల 23న ఉత్తర్వులు జారీచేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 20వ తేదీన కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ఆ సమయంలో ఇద్దరు ఇన్విజిలేటర్లు మద్యం సేవించి ఇన్విజిలేషన్ విధుల నిర్వహణలో అలసత్వం వహించారు. దీనిపై ప్రశ్నించిన స్క్వాడ్ బృందంతో వాదనకు దిగారు. ఈ విషయంపై స్క్వాడ్ బృందం కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఐఓకు ఫిర్యాదుచేసింది. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా డీవీఈఓ విచారణ జరిపి ఈ నెల 21న అందజేసిన నివేదిక ఆధారంగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కామర్స్, హిందీ లెక్చరర్‌లను విధుల నుంచి బహిష్కరిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల కాపీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విషయం వెలుగుచూసింది. కామర్స్ అధ్యాపకుడు ఓ దినపత్రికలో (సాక్షికాదు) విలేకరిగా పనిచేస్తుండడం గమనార్హం.



విధుల నుంచి తొలగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీ జారీచేసిన ఉత్తర్వుల కాపీ

# పనుల పూర్తికి కలెక్టర్ ఆదేశం

- పూర్తయిన పనులకు యూసీలు సమర్పించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తిచేయాలని, ఇప్పటికే పూర్తిచేసిన పనులకు సంబంధించిన యూసీలను సమర్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో ఎంపీ నిధుల పనుల పురోగతిపై శాఖల వారీగా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోటాలో జిల్లాకు రూ.12.10 కోట్ల విలువైన 309 పనులు మంజూరయ్యాయని, అందులో 150 పనులు పూర్తయ్యాయని, 41 పనులు పురోగతిలో ఉన్నట్టు వెల్లడించారు. మరో 117 పనులు ప్రారంభం కావాల్సి ఉందని, వీటిని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోటాలో 51 పనులు మంజూరుకాగా, ఒక్కపని మాత్రమే పూర్తయిందని, 38 పురోగతిలో ఉండగా 12 పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. 16వ లోక్‌సభ ఎంపీగా పనిచేసిన కె.హరిబాబు కోటాలో రూ.5.37 కోట్ల విలువైన 448 పనులు మంజూరు కాగా 327 పనులు పూర్తయ్యాయని, 63 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మరో 58 పనులు ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన సుబ్బిరామిరెడ్డి కోటాలో రూ.11 కోట్లతో 525 పనులు మంజూరు కాగా 366 పనులు పూర్తయ్యాయని, 104 పురోగతిలో ఉండగా 55 ప్రారంభం కావాల్సి ఉందన్నారు. ప్రారంభం కాని పనులకు ప్రస్తుతం అవసరాల మేరకు ప్రతిపాదనలను పంపాలన్నారు. ఎక్కువ పనులు పంచాయతీరాజ్‌శాఖకు చెందినవే ఉన్నాయని, త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. సమావేశంలో సీపీఓ పి.బాలాజీ, పంచాయతీరాజ్ ఎస్ఈ గుప్తా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్, దివ్యాంగుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# తప్పుచేసిన వారికి శిక్ష పడాల్సిందే...

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ్‌చక్రవర్తి



సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ్‌చక్రవర్తి

విజయనగరం లీగల్: తప్పుచేసిన వారికి శిక్ష పడాల్సిందేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు నష్ట పరిహారం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విజయనగరం న్యాయసేవా సదన్‌లో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉదాసీన వైఖరి, మనకెందుకులే అన్న ధోరణి వల్ల పెద్దపెద్ద నేరాలు చేసిన నిందితులు దర్జాగా బయటపడుతున్నారన్నారు. లైంగిక దాడుల కేసుల్లో సంఘటన జరిగిన తరువాత ఉన్న పరిస్థితి క్రమేపి బాధితుల్లో తగ్గిపోతుందన్నారు. ఈ కారణంగా కొంతమంది దళారీలు రాజీపేరుతో ప్రలోభపెడుతున్నారని, జరిగిపోయిందేదో జరిగిపోయింది... వారిని శిక్షిస్తే మనకేం వస్తుందిలే అనే భావన బాధితుల్లో పెరిగిందన్నారు. పోక్సో చట్టం, బాధిత నష్ట పరిహారం పథకం-2015పై అవగాహన కల్పించారు. బాధిత మహిళలు, ఇతర నేరాల వల్ల నష్టపోయిన వారికి కూడా పరిహారం అందేఅవకాశం ఉందన్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం 48 గంటల్లో జిల్లా కోర్టుకు మెయిల్ ద్వారా నివేదిక పంపాలని తెలిపారు. ఈ కారణంగా బాధితులకు త్వరితగతిన నష్టపరిహారం పొందే అవకాశం ఉందన్నారు. అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా మాట్లాడుతూ కఠిన శిక్షలతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. లైంగిక దాడుల కేసుల్లో పోలీసులు దర్యాప్తును సకాలంలో పూర్తిచేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. సదస్సులో జిల్లా అదనపు న్యాయమూర్తి కె.రాధారత్నం, ఎం.మీనాదేవి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, న్యాయసేవా సంస్థ కార్యదర్శి బి.వి.లక్ష్మీకుమారి, ప్రాంతీయ రవాణాశాఖ అధికారి జి.ఆదినారాయణ పాల్గొన్నారు.

# 30 రోజులు.. 50 శిబిరాలు

- వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు సన్నాహాలు
- మే 1 నుంచి 31వ తేదీ వరకు కొనసాగనున్న శిక్షణ
- 50 క్రీడాంశాల్లో 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సుగల వారికి అవకాశం
- ఒక్కో శిబిరంలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు శిక్షణ
- శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న డీఎస్ఏ



కబడ్డీ ఆడుతున్న చిన్నారులు

విజయనగరం:

ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు శుభవార్త. ఏటా వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్నట్టే ఈ ఏడాది కూడా ఉచిత వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. మే 1 నుంచి 31వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో 50 శిక్షణ శిబిరాలు నిర్వహించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు చర్యలు ప్రారంభించారు. వేసవిలో ఆయా ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి గల శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 31వ తేదీలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

#### క్రీడల్లో ప్రోత్సాహం.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. జిల్లా వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించింది. తద్వారా క్రీడల పట్ల ఆసక్తి గల 8 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాలబాలికలను వారికి ఇష్టం ఉన్న క్రీడల్లో ప్రోత్సహించనుంది. ఆయా గ్రామాలు, పట్టణాలకు చెందిన క్రీడాకారులు ఏ క్రీడ పట్ల ఎక్కువగా మక్కువ కనబరుస్తారో ఆయా క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించనుంది. ఈ మేరకు ముందస్తుగా ఆ క్రీడల్లో పరిణితి సాధించిన శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఒక్కో శిక్షణ శిబిరంలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, తైక్వాండో, ఫెన్సింగ్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర క్రీడాంశాలకు ఆదరణ ఉంది. ఇప్పటికే ఎంతో మంది క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించి తమ సత్తా చాటుకున్నారు. వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు దోహదపడనున్నాయి. విద్యార్థుల్లో మానసిక వికాసం, శారీరక దారుఢ్యానికి క్రీడలు మంచి వ్యాయామం కానున్నాయి.

#### దరఖాస్తుల ఆహ్వానం

వేసవిలో ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని శాప్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు చర్యలు ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించాం. ఆ మేరకు ఆసక్తి గల శిక్షకుల నుంచి ఈనెల 31వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. వారి దరఖాస్తుల మేరకు శిబిరాల నిర్వహణకు అవసరమైన సదుపాయాల కల్పనకు శాప్‌కు నివేదిస్తాం. ఆసక్తి గల శిక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.అప్పలనాయుడు, చీఫ్‌కోచ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, విజయనగరం

# క్షయ నివారణ విభాగం సిబ్బందిపై చర్యలు

- కాంట్రాక్టు ఉద్యోగిని విధుల నుంచి తొలగింపు
- సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలకు సిఫార్స్

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: క్షయ నివారణ విభాగంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ భర్తీ చేయడంలో తీవ్ర జాప్యం చేయడం, నోటిఫికేషన్‌లో విద్యార్హత తప్పుగా ప్రకటన ఇచ్చారనే అంశాలపై 'సాక్షి'లో గతనెల 25వ తేదీన 'ఎందుకీ జాప్యం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి క్షయ నివారణ విభాగం ఉన్నతాధికారులు స్పందించారు. పోస్టుల భర్తీలో జాప్యానికి బాధ్యులైన ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగిని విధులు నుంచి తొలగించారు. సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ రీజనల్ డైరెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఇదే విషయాన్ని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా కాంట్రాక్టు ఉద్యోగిని విధులు నుంచి తొలగించడం, సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్‌కు రీజనల్ డైరెక్టర్‌కు సిఫార్సు చేయడం వాస్తవమేనని తెలిపారు.


ఎందుకీ జాప్యం!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

## క్లుప్తంగా

### ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి


ఈశ్వరరావు మృతదేహం

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన జనపరెడ్డి ఈశ్వరరావు(38) ఆత్మహత్యకు పాల్పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వల్లంపూడి ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. బొద్దాం గ్రామానికి చెందిన ఈశ్వరరావు శుక్రవారం రాత్రి 8 గంటలకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

### పొట్టేళ్ల పందాలపై పోలీసుల దాడి


పందెంరాయుళ్లతో పాటు పొట్టేళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని కంబర గ్రామంలో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై శనివారం తెల్లవారుజామున దోనుబాయి ఎస్.ఐ కిషోర్ వర్మ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో రెండు పొట్టేళ్లు, ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని తొమ్మిది మంది పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ కృష్ణంనాయుడు తెలిపారు. రూ. 6,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. పేకాట శిబిరాలు నిర్వహించడం, పొట్టేళ్ల పందేలు జరిపించడం, క్రికెట్ బెట్టింగ్‌లు తదితర అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కిషోర్‌వర్మ పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మరణించిన సూరమ్మ

డెంకాడ: మండలంలోని కొత్త ముంగినాపల్లి జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బొబ్బాది సూరమ్మ(61) మృతి చెందిందని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్త (ఎస్సీ)ముంగినాపల్లి గ్రామం నుంచి గుణుపూరుపేట వైపు వస్తున్న సూరమ్మను వెనుక వైపు నుంచి వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సూరమ్మ అక్కడికక్కడే మరణించిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సూర్యారావు మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి సోపేరు గ్రామానికి చెందిన మామిడి సూర్యారావు (53) చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ వై.రవికిరణ్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. నిత్యం మద్యానికి బానిసైన సూర్యారావు ఎప్పటిలాగే ఈ నెల 18న మధ్యాహ్నం కొంత మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. మిగిలిన మద్యం సేవించేందుకు పశువుల శాలకు చేరుకున్నాడు. శాలలో దాచి ఉంచిన గడ్డి మందును మద్యం అనుకుని సేవించాడు. ఇది గమనించిన అతని భార్య సుజాత ఆటోలో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడని, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

### కోడిగుడ్ల ధరలు

| హోల్‌సేల్ ధరలు | (100 గుడ్లు) |
|---|---|
| విశాఖపట్నం | రూ. 420.00 |
| విజయనగరం | రూ. 424.00 |
| శ్రీకాకుళం | రూ. 424.00 |

### బులియన్

| విశాఖపట్నం | |
|---|---|
| బంగారం(24క్యా. 10గ్రా.) | 56,150–00 |
| బంగారం(22క్యా. 10గ్రా.) | 51,800–00 |
| వెండి (కిలో) | 71,200–00 |

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹118 | ₹206 | ₹ 216 |

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధంకండి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- పదో తరగతి విద్యార్థులకు అవగాహనా సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, చిత్రంలో కలెక్టర్ సూర్యకుమారి


హాజరైన పదో తరగతి విద్యార్థులు

విజయనగరం: విద్యార్థులు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాయడంపై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని సుజాత కన్వెన్షన్ హాలులో శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం ఒక కొత్త ఒరవడిగా పేర్కొన్నారు. దీనిని ఏర్పాటు చేసిన కార్పొరేషన్ విద్యా కమిటీని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. విద్య కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా, సమస్తమూ ప్రభుత్వమే అందిస్తోందని చెప్పారు. చక్కని విద్యను అందించడంతో పాటు, మంచి పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని కూడా ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల, బడి పిల్లలంతా శతశాతం భోజనం చేస్తున్నారని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి, తమపై తల్లితండ్రులు, గురువులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ కాలం విలువను తెలుసుకోవడం విజయానికి మేలైన మార్గమని పేర్కొన్నారు. దీనిని గుర్తించగలిగితే, సగం విజయాన్ని సాధించినట్టేనని అన్నారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఏకాగ్రతను అలవర్చుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకోవాలని, బాలికలు కూడా చిన్నవయసులోనే పెళ్లి జోలికి పోకుండా కనీసం డిగ్రీ వరకు చదువుకొని, ముందుగా తమ కాళ్లమీద తాము నిలబడేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు ప్రశాంతతను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకొనే వయసులో కష్టపడితే, జీవితంలో సుఖఃపడతారని అన్నారు. ఈ పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.25వేలు, రెండో విద్యార్థికి రూ.15వేలు, మూడో విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. సదస్సులో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, ఉప విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.తిరుపతినాయుడు, విద్యా కమిటీ సభ్యులు సంతోషికుమారి, బి.పద్మావతి, టి.సంధ్యారాణి, పార్టీ నాయకులు ఆశపు వేణు, ఉపన్యాసకులు రవి కె.మండా తదితరులు పాల్గన్నారు.

## టెక్నాలజీతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

- కార్పొరేట్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రభాత్‌కుమార్
- జీఎంఆర్ ఐటీలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాత్‌కుమార్

రాజాం సిటీ: విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అవకాశం ఉంటుందని కార్పొరేట్ కన్సల్టెంట్, సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ ప్రభాత్‌కుమార్ అన్నారు. జీఎంఆర్ ఐటీలో శనివారం నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన లక్ష్యాల వైపు పయనించాలని అన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా గతాన్ని మర్చిపోకూడదని తెలిపారు. ప్రతిభను పెంపొందించుకునేందుకు విదేశాలకు సైతం వెళ్లాలని సూచించారు. సొంత ఆలోచనా శక్తితోనే మంచి వ్యవస్థ స్థాపించి పది మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ గుర్తింపుతో దేశంలోనే 188వ ర్యాంకు రావడంతో పాటు నాక్-ఏ గ్రేడు, 5యూజీ ప్రొగ్రామ్స్ ఎన్‌బీఏ గుర్తింపు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులను సత్కరించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గొలివే గేమ్స్ గ్రూపు సీఈఓ పి.రవికిరణ్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, సీఈఓ ఎల్‌ఎం లక్ష్మణమూర్తి, గ్రంథి నీలాచలం, విద్యార్థులు, వివిధ విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ - డివిజన్ల మేనేజర్ పోస్టుల భర్తీకి చర్యలు

విజయనగరం అర్బన్: జిల్లాలోని రెండు ఈ - డివిజన్ మేనేజర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, చీపురుపల్లి రెవెన్యూ డివిజన్లలో ఒక్కో ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు బీసీఏ, బీఎస్‌సీ కంప్యూటర్స్, బీఈ సీఈసీ లేదా ఐటీ, బీటెక్ సీఎస్‌ఈ లేదా ఐడీ డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి ఇంగ్లిష్‌లో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని తెలిపారు. వయస్సు జూలై 1, 2022 నాటికి 21 – 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. నెలకు రూ.22,500 వేతనం ఇస్తామని కాంట్రాక్టు కాలం ఒక ఏడాది ఉంటుందని తెలిపారు. ఇవి కేవలం కాంట్రాక్టు ఉద్యోగాలు మాత్రమేనని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులకు రాతపరీక్ష నిర్వహిస్తామని దానిలో ఉత్తీర్ణులైన వారికి జిల్లా కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. రెండేళ్లపాటు ఐటీ రంగంలో అనుభవం ఉన్న వారికి 5 శాతం వెయిటేజ్ మార్కులను ఇస్తామని పేర్కొన్నారు. అధికారులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించిన నకిలీ ధ్రువపత్రాలను సమర్పించిన దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందని వివరించారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

- డీఎంహెచ్‌ఓ రమణకుమారి


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

వంగర: పీహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణకుమారి అన్నారు. స్థానిక పీహెచ్‌సీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, రికార్డులు నిర్వహణ, ఉద్యోగుల హాజరు, ఆపరేషన్ థియేటర్, పేషెంట్స్ గదులను పరిశీలించారు. అనంతరం మందులు భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. మందుల నిల్వలపై అప్రమత్తంగా ఉండాని సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహణపై సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో పూర్తి స్థాయి సిబ్బంది నియామకం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌమ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మహిళ మృతి


గుర్తు తెలియని వృద్ధురాలు మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక ఎస్‌సీఎస్ థియేటర్ పక్కన ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా సుమారు 45 నుంచి 55 ఏళ్ల మధ్య ఉన్న మహిళ మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యులెవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని వన్‌టౌన్ సీఐ వెంకటరావు కోరారు.

## సామాన్యులకు న్యాయసేవలు అందాలి

- న్యాయమూర్తి ఉంగట్ల సత్యారావు


మాట్లాడుతున్న ట్రిబ్యునల్ జడ్జి ఉంగట్ల సత్యారావు

బొబ్బిలి: సామాన్యులకు న్యాయం అందేలా న్యాయవాదులు కృషి చేయాలని, న్యాయవ్యవస్థపై అందరికీ నమ్మకం కలిగేలా న్యాయవాదులంతా పని చేయాలని విశాఖ భూసేకరణ, రీహేబిటేషన్ ప్రిసైడింగ్ అధికారి, ట్రిబ్యునల్ జడ్జి ఉంగట్ల సత్యారావు సూచించారు. స్థానిక ఎన్జీఓ హోంలో భారత న్యాయవాదుల సంఘం జిల్లా సభలు స్థానిక న్యాయవాది కండాపు ప్రసాదరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి సత్యారావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయవాదులు తమ వాదనా పటిమకు పదును పెట్టాలని, న్యాయవ్యవస్థ, ప్రజలు, మారుతున్న సమాజంపై పట్టు సాధించాలని సూచించారు. సుప్రీంకోర్టు పలు చట్టాలను మార్చాలని సూచించినా పార్లమెంట్ తిరస్కరించిందని, మార్పు అనివార్యమైనా మార్పు రాలేదన్నారు. న్యాయవాదులు కోర్టుల విలువైన సమయాన్ని, కక్షిదారుల సహనం పరీక్షించరాదన్నారు. 550 జిల్లాలలో విస్తరించిన భారత న్యాయవాదుల సంఘం పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. ఐఏఎల్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కెఎస్.సురేష్‌కుమార్, సభ్యులు భగవతమ్మ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా నుంచి పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హాజరయ్యారు. పలువురు న్యాయవాదులు తమ అనుభవాలను పంచుకున్నారు.

### ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: తన అకౌంట్ నుంచి డబ్బులు విత్ డ్రా అయినట్లు రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న ఉమ అనే మహిళ ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం తెలిపారు. గుర్తు తెలియని మెసేజ్‌లు, లింక్ ఓపెన్ చేయడంతో వారి అకౌంట్ నుంచి రూ.88వేల 435 విత్ డ్రా అయినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## 31న చిరుధాన్యాల మహోత్సవం

పార్వతీపురం: చిరుధాన్యాల మహోత్సవాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఆరోగ్యానికి చిరుధాన్యాలు అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. చిరుధాన్యాల మహోత్సవం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిరుధాన్యాల మహోత్సవం విజయవంతం చేయాలన్నారు. అన్ని చిరు ధాన్యాలలో మానవ ఆరోగ్యానికి అవసరమైనటువంటి కాల్షియం, ఇనుము, మెగ్నీషియం, భాస్వరం అనే ఖనిజాలు ఎక్కువ మొత్తంలో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చిరుధాన్యాల ఆహార పదార్థాలను స్టాల్స్‌లలో అమ్మకానికి, ప్రదర్శనకు పెట్టే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. చిరుధాన్యాలు యొక్క ప్రాముఖ్యత, మానవ ఆరోగ్యం అనే విషయంపైన వ్యాసరచన పోటీలు మండలాల స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో చిరు ధాన్యాలపై దృష్టి సారించాలని, మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, డీఈఓ ఎస్‌డీవీ రమణ, టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

- జేసీ ఆనంద్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

పార్వతీపురం టౌన్: అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ పక్షోత్సవాలను పురస్కరించుకుని గత పదిహేను రోజులుగా జరుగుతున్న వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు విద్య, వైద్య, శిశు సంక్షేమ శాఖల నుండి ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయంగా రాణిస్తున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన మన జిల్లాలో విద్యా, వైద్య, శిశు సంక్షేమ రంగాల్లో మహిళలు ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశం ప్రథమ స్థానంలో ఉండాలంటే మహిళలు ముఖ్య పాత్ర వహించాలని జేసీ సూచించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరంగా మహిళలు, పురుషులు సమానమేనని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలంతా శాంతియుతంగా, ప్రశాంతంగా జీవించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి జరుపుకోవాలని సూచించిదన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయగౌరీ, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎంహెచ్‌ఓ బగాది జగన్నాథరావు, క్రీడా సాధికారత అధికారి కె.రామ్‌గోపాల్, క్రీడా శాఖ జిల్లా అధికారి ఎస్.వెంకటేశ్వరావు, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, క్రీడా సాధికారత కో - ఆర్డినేటర్ గాంధీ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీలకు జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 31 వరకు సబ్ జూనియర్స్, కాడెట్ విభాగాల్లో రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జాతీయ తైక్వాండో పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల్లో ఎస్.షణ్ముఖ సిద్ధార్థ నాయుడు, బొంగు యశస్విని, జి.జాహ్నవి, జి.చరిత, సీహెచ్ హర్షవర్ధన్, కె.మొక్షిత్ ఉన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యాలు, కార్యదర్శి సి.హెచ్. వేణుగోపాలరావు, కోచ్‌లు టి.రాజు, కె.కోటేశ్వరరావు అభినందించారు.

## పిడుగు పాటుకు నలుగురికి గాయాలు


చికిత్స పొందుతున్న పిడుగుపాటుకు గురైన మహిళ

గుర్ల: మండలంలోని కొండగండ్రేడులో శనివారం పడిన పిడుగు పాటుకు నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మంత్రి అప్పలరాములు, మంత్రి సింహచలం, పరాల జయ, పొట్నూరు లక్ష్మి శనివారం సాయంత్రం పొలాల్లో మొక్కజొన్న పంట పనిలో ఉన్నారు. ఒక్కసారిగా వాతావరణం మారడంతో ఉరుములతో కూడిన వర్షం పడింది. మహిళలు పనిచేస్తున్న కొద్ది దూరంలో పిడుగు పడడంతో నలుగురు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. ఇది గమనించిన స్థానికులు 108 సహాయంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారులు చికిత్స అందిస్తున్నారు. నలుగురు మహిళలకు చికిత్స అందిస్తున్నా.. స్పృహలోకి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.